సాక్షి
కాకినాడ

శనివారం | 5 | ఏప్రిల్ | 2025




రాములోరి పెళ్లి సందడి
ఆంధ్రా భద్రాద్రిగా పేరొందిన జి.మామిడాడలో శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నారు.

8లో



పెట్రోలియం రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతం
పెట్రోలియం రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని ఆయిలిండియా ఈడీ సలోమ యండో అన్నారు.

డెల్టాలకు 10,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 10,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3 వేలు, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,300 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.50 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

21న కాకినాడ బార్ ఎన్నికలు

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్‌కు 2025–26 సంవత్సరానికి గాను ఈ నెల 21న ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల సీఈఓ ముత్తింటి విశ్వేశ్వరరావు శుక్రవారం ఈ విషయం తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు వివిధ పదవుల జాబితాను విడుదల చేశారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ, లైబ్రరీ సెక్రటరీ, కోశాధికారి, మహిళా ప్రతినిధి, సూపర్ సీనియర్ కమిటీ మెంబర్, సీనియర్ కమిటీ మెంబర్, మహిళా కమిటీ మెంబర్, కమిటీ మెంబర్లుగా సీనియారిటీ ప్రకారం పోటీ చేయవచ్చని వివరించారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో నామినేషన్లు స్వీకరిస్తామని, 10న పరిశీలన, 11వ తేదీ వరకూ ఉపసంహరణకు గడువు ఇచ్చామని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు 1,160 మంది అర్హత కలిగి ఉన్నారన్నారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని, అదే రోజు సాయంత్రం ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తామని విశ్వేశ్వరరావు తెలిపారు.

'నా భర్త ఆచూకీ చెప్పండి'

ఏలేశ్వరం: తన భర్త రామకృష్ణ ఆచూకీ తెలపాలంటూ మండలంలోని కంబాలపాలెం గ్రామానికి చెందిన గిరిజన మహిళ సిరుబోతుల లక్ష్మీ పార్వతి శుక్రవారం ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె కథనం ప్రకారం అటవీ అధికారులు తన భర్తపై తప్పుడు కేసు నమోదు చేశారని, గత నెల 15న తమ వద్దకు పిలిపించుకుని, చేయని తప్పు ఒప్పుకోవాలంటూ చిత్రహింసలకు గురి చేశారని ఆరోపించింది. గత నెల 26 నుంచి తన భర్తను కనపడకుండా చేశారని తెలిపింది. దీనిపై రాష్ట్ర హైకోర్టులో గత నెల 28న హెబియస్ కార్పస్ పిటిషన్ వేశానని, పోలీసులు వెంటనే విచారణ జరిపి, తన భర్త ఆచూకీ తెలపాలని ఆమె డిమాండ్ చేసింది. గిరిజన మహిళనైన తనకు న్యాయం చేయాలని కోరింది. ఈ నేపథ్యంలో రామకృష్ణ జాడ తెలిపిన వారికి రివార్డు ఇస్తామని పోలీసులు శుక్రవారం కంబాలపాలెం తదితర గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు.

బీసీ స్వయం ఉపాధి యూనిట్లకు రుణాలివ్వాలి

కాకినాడ సిటీ: బీసీ వర్గాల స్వయం ఉపాధి యూనిట్లకు రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను కలెక్టర్ షణ్మోహన్ కోరారు. జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సంస్థ ద్వారా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల కింద రుణాల మంజూరుపై కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ స్వయం ఉపాధి యూనిట్ల మంజూరుకు మార్చి 10 నుంచి 25వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో సుమారు 57 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ యూనిట్లకు రుణాల మంజూరును రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11న జ్యోతిబా పూలే జయంతి ప్రారంభించనున్నదన్నారు. ఈ నేపథ్యంలో లక్ష్యానికి అనుగుణంగా రుణాల మంజూరుకు చర్యలు చేపట్టాలని కోరారు. అందిన దరఖాస్తుల్లో 25 శాతం వరకూ యూనిట్లకు ఈ నెల 11న రుణాలు మంజూరు చేసేలా బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ జె.వెంకటరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు, డీసీసీబీ సీఈఓ ఆర్వీ నరసింహరావు, ఎల్డీఎం సీహెచ్ఎస్ ప్రసాద్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

గడ్డికి గడ్డుకాలం..!

- యంత్రాలతో వరి కోతలు
- ఎండు గడ్డి కొరతతో ఇబ్బందులు
- పశుగ్రాస పథకాలను మరచిన ప్రభుత్వం
- పశుపోషణ భారంగా మారిందంటున్న పాడి రైతులు



పశువులకు ఇక పచ్చగడ్డి కరువే

పిఠాపురం: ఎండాకాలం వచ్చిందంటే పచ్చిగడ్డి మచ్చుకైనా కనిపించదు. వేసవిలో పశుపోషణ అంతా ఎండుగడ్డి పైనే ఆధారపడి ఉంటుంది. గతంలో ఎండు వరి గడ్డికి లోటు ఉండేది కాదు. కానీ కొన్నేళ్లుగా వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో ఎండుగడ్డికి తీవ్ర కొరత ఏర్పడుతోంది. దీంతో మూగజీవాలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనిని అధిగమించే దిశగా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు. ఫలితంగా పాడి పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యంత్ర కోతలతో..

కొన్నేళ్లుగా కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు యంత్రాలతో వరి కోతలపై మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు వాతావరణంలో తరచుగా వస్తున్న మార్పులతో పంటను హడావుడిగా ఒబ్బిడి చేసుకునేందుకు యంత్రాలతో కోతలకే రైతులు సిద్ధపడుతున్నారు. కూలీలతో పోలిస్తే యంత్రాలతో కోతల వలన ఖర్చు, సమయం ఆదా అవుతోంది. అయితే, కూలీలతో కోతలు కోయిస్తే పశువులకు అవసరమైన ఎండు గడ్డి పెద్ద మొత్తంలో లభిస్తుంది. అదే యంత్రాలతో కోతలు కోస్తున్న పొలాల్లో ఎండుగడ్డి రావడం లేదు. యంత్రంతో కోతల వలన వరి దుబ్బులో సగానికి పైగా నేల మీదే ఉండిపోతుంది. మిగిలిన సగం యంత్రంలో నలిగిపోయి పశువులు తినడానికి పనికి రాకుండా పోతోంది. అక్కడక్కడ యంత్రాలతో కోసిన గడ్డిని సేకరిస్తున్నప్పటికీ డీజిల్ వాసన వస్తూండటంతో ఆ గడ్డిని పశువులు తినడం లేదని రైతులు చెబుతున్నారు. మరోవైపు చాలా మంది పంట పొలాలను రొయ్యలు, చేపల చెరువులుగా మార్చేస్తున్నారు. పలుచోట్ల పొలాలు రియల్ ఎస్టేట్ లే అవుట్లుగా మారిపోతున్నాయి. ఈ కారణాల వలన కూడా పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడుతోంది.



పశువులకు ఎండుగడ్డిని సైకిల్‌పై తెస్తున్న రైతు



యంత్రాలతో కోసిన గడ్డిని ఏరుతున్న రైతులు

పశుగ్రాస పథకాలు దూరం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కనిష్ఠంగా 25 సెంట్లు, గరిష్ఠంగా 2.5 ఎకరాల సొంత భూమి కలిగి ఉన్న రైతులకు పశుగ్రాసం పెంపకానికి చేయూతనిచ్చేవారు. సైలేజ్ గడ్డి, టీఎంఆర్ దాణా, పశుగ్రాసం పెంచడానికి పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీపై అందించేవారు. దీంతో వేసవిలో పశుగ్రాసానికి కొరత లేకుండా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పశుగ్రాస పథకాలను పక్కన పెట్టేశారు. దీంతో ఈ ఏడాది రబీ కోతలు మొదలైన తొలి దశలోనే పశుగ్రాసం కొరత రైతులను వెంటాడుతోంది.

జిల్లాలో పశువుల వివరాలు

ఆవులు	76,502
గేదెలు	2,82,273
గొర్రెలు	1,01,870
మేకలు	1,41,229

పశువులకు అవసరమయ్యే ఎండుగడ్డి రోజుకు 2 మెట్రిక్ టన్నులు

పెరిగిన ధరలు

కేవలం కూలీలతో కోతలు కోసిన వరి గడ్డి మాత్రమే పశువులకు పనికి వస్తూండటం.. అది అతి తక్కువగా మాత్రమే అందుబాటులో ఉండటంతో గడ్డి ధరలు భారీగా పెరిగాయి. ట్రాక్టర్ ఎండుగడ్డి ధర రూ.12 వేల నుంచి రూ.14 వేలు పలుకుతోంది. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న రైతులు నేరుగా పొలాల్లోనే వరి గడ్డిని కొనుగోలు చేసి, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దీంతో స్థానికంగా గడ్డికి బాగా డిమాండ్ పెరిగింది. ఈ పరిస్థితుల్లో పశువులకు మేత దొరకడం కష్టంగా మారిందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండుగడ్డి దొరకడం లేదు



వాతావరణం అనుకూలించక పోవడంతో ప్రస్తుతం అన్నిచోట్లా యంత్రాలతో కోతలు జరుగుతున్నాయి. దీంతో ఎండుగడ్డి దొరకడం కష్టంగా మారింది. గతంలో మనుషులతో కోతలు జరిగేవి. అప్పుడు ఎండుగడ్డి పుష్కలంగా ఉండేది. ఇప్పుడు ఎక్కడ వెతికినా ఎండుగడ్డి దొరకడం లేదు. చాలా ఇబ్బందిగా ఉంది. ప్రస్తుతం ఎండలు ముదరడంతో పచ్చిగడ్డి దొరికే పరిస్థితి లేదు. ఎండుగడ్డి దొరకక పశు పోషణ కష్టంగా మారింది.

– చర్మాకుల కృష్ణ, రాపర్తి, పిఠాపురం మండలం

అప్పుడు అమ్మే వాళ్లం.. ఇప్పుడు కొనాల్సి వస్తోంది



యంత్రాలు వచ్చాక పశుగ్రాసానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గతంలో కోతలు కోసి, కుప్పలుగా వేసే వాళ్లం. దాంతో పశుగ్రాసానికి ఇబ్బందులుండేవి కావు. చాలా గడ్డి అందుబాటులో ఉండేది. ఇతర ప్రాంతాల వాళ్లు ఇక్కడకు వచ్చి ఎండు గడ్డి కొనుక్కునే వారు. కానీ, ఇప్పుడు మా సొంత గేదెలకే గడ్డి లేకుండా పోయింది. ఇతర ప్రాంతాల నుంచి గడ్డి కొనుక్కోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. దీంతో పశువులను పెంచడం మోయలేని భారంగా మారింది. అందుకే చాలా మంది పశువులను అమ్ముకుంటున్నారు.

– పెద్దింటి రాజు, రాపర్తి, పిఠాపురం మండలం

పెళ్లి పీటలు ఎక్కే వేళ.. మృత్యుఘాతం

- లారీ ఢీకొని వరుడి మృతి
- పెళ్లి, పుట్టిన రోజు దుస్తులు కొనుక్కుని వస్తుండగా ప్రమాదం
- విలపిస్తున్న తల్లిదండ్రులు



మృతుడు శ్రీను (ఫైల్)

గండేపల్లి/జగ్గంపేట: మరో పదిహేను రోజుల్లో పెళ్లి.. నేడు పుట్టిన రోజు.. ఈ నేపథ్యంలో కొత్త దుస్తులు కొనుక్కుని.. ఎంతో ఆనందంగా తిరిగి వస్తున్న ఆ యువకుడిపై మృత్యువు కన్నెర్ర చేసింది. లారీ రూపంలో దూసుకువచ్చి, అతడి ఆయువు హరించేసింది. పెళ్లి చేసుకుని, కొడుకు, కోడలు చిలకాగోరింకల్లా తమ కళ్ల ముందు తిరుగుతూంటే చూసి మురిసిపోవాలనుకున్న కలలు కల్లలు కావడంతో ఆ తల్లిదండ్రుల ఆవేదనకు అంతేలేకుండా పోయింది. ఈ విషాద ఘటన వివరాలివీ..

గండేపల్లి మండలం మల్లేపల్లికి చెందిన చిక్కాల కాటమస్వామి, సావిత్రి దంపతులకు కుమార్తె, కుమారుడు చిక్కాల శ్రీను (28) ఉన్నారు. కుమార్తెకు గతంలోనే వివాహం చేశారు. శ్రీను ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తండ్రి కాటమ స్వామి వ్యవసాయం చేస్తున్నారు. శ్రీనుకు గోకవరం మండలం మల్లవరం గ్రామానికి చెందిన అమ్మాయితో ఈ నెల 20న వివాహం చేయాలని నిశ్చయించారు. శనివారం శ్రీను పుట్టిన రోజు. ఈ నేపథ్యంలో పుట్టిన రోజు, పెళ్లి వేడుకలకు అవసరమైన దుస్తులు కొనుగోలు చేసేందుకు స్నేహితుడితో కలిసి, శ్రీను శుక్రవారం మోటార్ సైకిల్‌పై పెద్దాపురం వెళ్లాడు. అక్కడ మిత్రులిద్దరూ కొత్త దుస్తులు కొనుకున్నారు. సాయంత్రం ఆనందంగా ఇంటికి తిరిగి వస్తూండగా, వారి బైక్‌ను జగ్గంపేట మండలం కాట్రావులపల్లి పెట్రోల్ బంకు వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీను (28) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మోటార్ సైకిల్‌పై ఉన్న స్నేహితుడు స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంపై జగ్గంపేట ఎస్సై రఘునాథరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లింట పెను విషాదం

శ్రీను పెళ్లి సమయం సమీపిస్తూండటంతో కుటుంబ సభ్యులందరూ పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యారు. ఇంతలోనే పెళ్లి దుస్తుల కోసం వెళ్లిన వరుడు శ్రీను రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడనే సమాచారంతో కుటుంబం తల్లడిల్లిపోయింది. పుట్టిన రోజు వేడుక, పెళ్లి సంబరాలతో ఆనందం నిండాల్సిన ఆ ఇంట్లో ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి. పరిసరాల్లో విషాదం నెలకొంది. అందరితోనూ స్నేహభావంతో ఉండే శ్రీను మృతి అందరినీ కలచి వేసింది.

రక్తదానంపై అవగాహనకు సైకిల్ యాత్ర



తుని రూరల్: రక్తదానంపై యువతలో అవగాహన, చైతన్యం తీసుకువచ్చే లక్ష్యంతో సేవ్ బ్లడ్ పేరుతో తుని మండలం టి.తిమ్మాపురానికి చెందిన ఆకేటి బుజ్జిబాబు శుక్రవారం సాయంత్రం సైకిల్ యాత్ర చేపట్టాడు. తుని మండలం వి.కొత్తూరు సమీపంలోని పెట్రోల్ బంకులో రాత్రి బస చేశాడు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ, నాలుగు నెలల పాటు తన యాత్ర కొనసాగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణకు ప్రధాన కారకుడైన పొట్టి శ్రీరాములు త్యాగాన్ని కూడా నేటి తరానికి తెలియజేస్తానన్నారు. గతంలో కూడా తాను అనేక యాత్రలు చేశానన్నారు.

స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

కాకినాడ లీగల్: స్లాట్ బుకింగ్ విధానం ద్వారా కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జె.జయలక్ష్మి మాట్లాడుతూ, స్లాట్ బుకింగ్ కోసం కక్షిదారులు రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి, ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 వరకూ స్లాట్ బుక్ చేసుకోవాలని అన్నారు. అందులో వివరాలు పొందుపరచి, స్లాట్ బుకింగ్ ఆప్షన్‌కు వెళ్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎంచుకోవాలని తెలిపారు. అనంతరం రిజిస్ట్రేషన్ బుకింగ్ తేదీ, సమయం పచ్చ రంగులో, ముందుగా ఎవరైనా రిజిస్ట్రేషన్ కోసం నమోదు చేసుకున్న తేదీలు, సమయాల వివరాలు ఎరుపు రంగులో కనిపిస్తాయన్నారు. కక్షిదారులు పచ్చరంగులోని తేదీలను ఎంచుకోవాలన్నారు. అనంతరం కక్షిదారు మొబైల్‌కు వన్ టైం పాస్‌వర్డ్ వస్తుందన్నారు. దానిని నిర్ధారించాక స్లాట్ బుక్ అవుతుందని చెప్పారు. ఒకసారి బుక్ చేసుకున్న స్లాట్ మార్చుకోవాలంటే అదనంగా రూ.200 చెల్లించాలని తెలిపారు. స్లాట్ బుకింగ్ ద్వారా తొలుత రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజును సబ్ రిజిస్ట్రార్ ఆర్వీ రామారావు సమక్షంలో జయలక్ష్మి అందజేశారు.

తప్పని ఇబ్బందులు

స్లాట్ బుకింగ్‌తో కొంత మంది క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. స్లాట్ బుకింగ్ సమయానికి క్రయవిక్రయదారులు రాకపోవడంతో స్లాట్ బుకింగ్ ముగిసింది. వారికి సాయంత్రం 5.30 తరువాత ఇప్పటి వరకూ ఉన్న ప్రైమ్ 2.0 విధానంలో రిజిస్ట్రేషన్ చేశారు. సాయంత్రం 5.30 తరువాత పాత విధానంలో సుమారు 30 దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఉదయం 10.30 నుంచి 5.30 వరకూ స్లాట్ విధానంలో సుమారు 30 దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేశారు. రాత్రి 8 గంటల వరకూ రిజిస్ట్రేషన్లు చేస్తూండటంతో సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బంది, క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విధానం వలన ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకూ విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



స్లాట్ బుకింగ్ ద్వారా తొలి రిజిస్ట్రేషన్ దస్తావేజును అందజేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ జయలక్ష్మి

దోషులను కఠినంగా శిక్షించాలి

- నాగాంజలి మృతికి సంతాపం
- బాధితులను ప్రభుత్వ పెద్దలు ఎందుకు పరామర్శించలేదు?
- వైఎస్సార్ సీపీ నేత నాగమణి



కాకినాడ రూరల్: ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి మృతికి కారకుడైన కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఏజీఎం దీపక్‌ను, ఇతర దోషులందరినీ కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జోనల్ కార్యదర్శి జమ్ములమడక నాగమణి డిమాండ్ చేశారు. మృత్యువుతో 12 రోజుల పాటు పోరాడి రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందిన నాగాంజలి కుటుంబానికి పార్టీ తరఫున ఆమె సంతాపం, సానుభూతి తెలిపారు. కాకినాడ కొత్త గైగోలుపాడులోని తన నివాసంలో శుక్రవారం నాగమణి మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, అధికార ప్రతినిధి శ్యామల, తాను ఇటీవల రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగాంజలిని చూశామన్నారు. ఆ తల్లిదండ్రుల బాధ చూస్తే తన మనస్సు చలించిపోయిందన్నారు. మహిళా హోం మంత్రి ఉండి కూడా రాష్ట్రంలో ఆడవారికి రక్షణ లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తరఫున నాగాంజలిని ఆస్పత్రిలో కనీసంగా కూడా పరామర్శించలేదన్నారు. గత వారం సీఎం చంద్రబాబు పోలవరం వచ్చారని, పరామర్శించాలనుకుంటే రాజమహేంద్రవరం అక్కడకు ఎంత దూరమని ప్రశ్నించారు. ఆడపిల్లలపై చేయి వేస్తే తాట తీస్తానన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ ఘటనను ఎందుకు ఖండించలేదని నిలదీశారు. సుమారు 30 వేల మంది మహిళలు కనిపించడం లేదని ఎన్నికల ముందు తప్పుడు ప్రచారం చేసిన పవన్.. ఇప్పుడెందుకు మాట్లాడడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ వారిపై అక్రమ కేసులు బనాయించడం, అరెస్టు చేసి జైలుకు పంపడమే పరిపాలనని ప్రభుత్వం భావిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నాని గుండె సమస్యతో బాధ పడుతూ చికిత్స పొందుతూంటే దానిపై కూడా మంత్రి లోకేష్ సెటైర్లు వేస్తున్నారని దుయ్యబట్టారు. మా రెడ్‌బుక్ చూస్తే ఒకరికి గుండె నొప్పి వస్తుందని, మరొకరికి బాత్‌రూములో చేయి విరుగుతుందంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి వంటి వారిని కూడా వెటకారం చేస్తున్నారని మండిపడ్డారు. అహంకారం తగదని, ప్రజలను రక్షించాలనే లక్ష్యంతోనే పరిపాలన సాగించాలని నాగమణి హితవు పలికారు.

చేతులు కాలాక..

- ఫిబ్రవరిలో బర్డ్‌ఫ్లూతో కోళ్ల మరణాలు
- తీరిగ్గా వ్యాధి నిర్ధారించిన ప్రభుత్వం
- అమ్మకాలపై ఇప్పుడు ఆంక్షలు
- ఇదేం విడ్డూరమంటున్న జనం



బర్డ్‌ఫ్లూతో మృతి చెందిన కోళ్లు (ఫైల్)

పిఠాపురం: చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉంది ప్రభుత్వ తీరు. గత ఫిబ్రవరిలో బర్డ్‌ఫ్లూ సోకి పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. అప్పట్లో స్థానికంగా అధికారులు కొన్ని ఆంక్షలు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆ తర్వాత కోళ్లు, కోడిగుడ్ల అమ్మకాలు యథేచ్ఛగా జరిగిపోయాయి. చివరకు బర్డ్‌ఫ్లూతో చనిపోయిన కోళ్లను చేపల చెరువుల్లో మేతగా కూడా వాడేశారనే ఆరోపణలు వచ్చాయి. ఇదంతా జరిగి, దాదాపు రెండు నెలలైన తర్వాత కోళ్ల మరణాలకు బర్డ్‌ఫ్లూయే కారణమని ప్రభుత్వం తీరిగ్గా నిర్ధారించింది. ఆ పేరుతో ఇప్పుడు ఆంక్షలు విధిస్తూ ఆదేశాలు ఇచ్చింది. ఇదేం విడ్డూరమని జనం ప్రశ్నిస్తున్నారు.

ఏం జరిగిందంటే..

గత ఫిబ్రవరి 10 నుంచి 20వ తేదీ వరకూ పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లోని మూడు కోళ్ల ఫారాల్లో కోళ్లు గుట్టలు గుట్టలుగా మృతి చెందాయి. దీనికి బర్డ్‌ఫ్లూయే కారణమంటూ అప్పట్లో నియోజకవర్గంలో జరిగిన ప్రచారం కలకలం సృష్టించింది. బర్డ్‌ఫ్లూ అంటూ పిఠాపురం, పిఠాపురం మండలం కుమారపురం, చిత్రాడ, నర్సింగపురం, గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన కోళ్ల ఫారాల్లో కొన్ని రోజుల పాటు ఒక్కసారిగా వేలాదిగా కోళ్లు మృతి చెందాయి. దీంతో, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అప్పట్లో పౌల్ట్రీల యజమానులు కోళ్లు సరఫరా చేసిన కంపెనీకి సమాచారం అందించారు. దీంతో ఆ కంపెనీ సిబ్బంది వచ్చి, చనిపోయిన కోళ్ల శాంపిల్స్ తీసుకెళ్లారు. మరోవైపు అధికారులు ఆయా ఫారాల్లో చనిపోయిన కోళ్ల శాంపిల్స్ సేకరించారు. వాటిని భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్‌కు పంపించారు. అక్కడ వివిధ పరీక్షల అనంతరం ఇక్కడి కోళ్లు బర్డ్‌ఫ్లూ వల్లనే చనిపోయాయని రెండు నెలల తరువాత నిర్ధారించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. ఈ నేపథ్యంలో సంబంధిత చట్టం కింద చెందుర్తి, పిఠాపురంలోని కోళ్ల ఫారాల నుంచి కిలోమీటరు పరిధిలో ఇన్‌ఫెక్టెడ్ జోన్‌గా, 10 కిలోమీటర్ల పరిధి వరకూ సర్వైలెన్స్ జోన్‌గా ప్రకటించి, ఆంక్షలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రాంతాల నుంచి కోళ్లను అమ్మడం లేదా కొనడం జరగకుండా, ఇతర ప్రాంతాలకు సరఫరా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ జీఓ నంబరు 122 జారీ చేశారు. బర్డ్‌ఫ్లూ ప్రబలి, వ్యాధి తీవ్రత తగ్గిన తరువాత ఇప్పుడు ఆంక్షలు అమలు చేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ప్రమాదం లేదని అప్పట్లోనే ప్రచారం

కోళ్లు చనిపోయిన ఫారాల్లోనే అధికారులు అప్పట్లో ఆంక్షలు విధించారు. కానీ, వాటి సమీపంలోని అన్ని ఫారాల్లో కోళ్లు, కోడిగుడ్ల అమ్మకాలు మామూలుగానే జరిగిపోయాయి. బర్డ్‌ఫ్లూపై భయపడాల్సిన పని లేదని, అందరూ కోడి మాంసం, గుడ్లు తినవచ్చని అధికారులే స్వయంగా అప్పట్లో ప్రచారం చేశారు. గర్భిణులకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం గుడ్లు సరఫరా చేశారు. అధికారుల ప్రచారంతో మాంసాహార ప్రియులు యథావిధిగా చికెన్, గుడ్లు తిన్నారు. ఇదంతా జరిగి, నెలలు గడచిన తరువాత ఇప్పుడు ఆంక్షలు విధించడంతో అందరిలోనూ ఒక్కసారిగా కలవరం మొదలైంది. ఇప్పటి వరకూ కేవలం వ్యాధి ప్రబలిన ఫారాల వద్దే ఆంక్షలు అమలు కాగా, ఇప్పుడు 10 కిలోమీటర్ల పరిధిలో ఆంక్షలు విధించడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వ్యాధి నిర్ధారణకు నెల రోజుల సమయం పడుతుందని, అందువల్లే ఆలస్యం అయిందని అధికారులు అంటున్నారు. అయినప్పటికీ ఆంక్షలు కఠినంగా అమలు చేశామని, కొత్తగా ఆంక్షలు పెట్టాల్సిన పని లేదని అంటున్నారు. వేసవి తీవ్రత పెరిగినందున బర్డ్‌ఫ్లూ ప్రభావం ఉండదని చెబుతున్నారు. మరోవైపు ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

నాగాంజలి మృతి బాధాకరం

- ఆమె ఆఖరి కోరిక ప్రకారం దీపక్‌కు కఠిన శిక్ష పడాలి
- ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్



నాగాంజలి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

సాక్షి, రాజమహేంద్రవరం/కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఫార్మసీ విద్యార్థిని నాగాంజలి మృతి బాధాకరమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆమె మరణ వార్త తెలుసుకుని పోస్టుమార్టం చేస్తున్న ప్రభుత్వాసుపత్రికి చేరుకున్న ఆయన శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, మృతురాలు సూసైడ్ నోట్‌లో ఏం కోరుకుందో దానిపై ఆమె తల్లిదండ్రులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. దీపక్‌కు కఠిన శిక్ష పడాలని నాగాంజలి కోరుకుందని, అది నెరవేరే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీపక్ లాంటి కీచకులకు తగిన శిక్ష విధించడం ద్వారా ఇలాంటి ఘటనలు జరగకుండా చూడవచ్చన్నారు. నాగాంజలి కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం, కిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని, ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. తానేదో రాజకీయం చేస్తున్నట్లు కొందరు పేర్కొనడం తగదని భరత్‌రామ్ పేర్కొన్నారు. విద్యార్థులు ధర్నా చేస్తున్నప్పుడు తాను కూడా వెళ్లానన్నారు. నాగాంజలి స్వయంగా ఇంజక్షన్ చేసుకుందా.. లేక ఎవరైనా చేశారా అనే అనుమానాస్పద ఘటన నేపథ్యంలో ఆ అమ్మాయికి తగిన న్యాయం జరిగే వరకూ అండగా ఉండాలని భావించామని వివరించారు. అప్పుడే విషయం బయటకు వచ్చిందని, లేకుంటే ఆ రోజు సాయంత్రమే చక్కబెట్టేసి ఉండేవారని అన్నారు. విషయం బయటకు వచ్చాకే దీపక్‌పై కఠిన సెక్షన్లు పెట్టారన్నారు. ఈ ఘటనపై హోం మంత్రి స్పందించకపోవడం, కనీసం ఒక ట్వీట్ కూడా చేయకపోవడం దారుణమన్నారు. దీనినిబట్టి కూటమి ప్రభుత్వం ఆడపిల్లలకు ఇచ్చే గౌరవమేమిటో అర్థమవుతోందని భరత్‌రామ్ అన్నారు.

క్లుప్తంగా

తప్పిపోయిన బాలుడు చైల్డ్ హెల్ప్‌లైన్‌కు అప్పగింత


బాలుడిని చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బందికి అప్పగిస్తున్న జీఆర్పీ ఎస్ఐ రవికుమార్

కాకినాడ సిటీ: ఇంట్లో తల్లిదండ్రులు మందలించడంతో సికింద్రాబాద్ నుంచి కాకినాడ వచ్చే ట్రైన్ నంబర్ 67446 ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఎం2 కోచ్‌లో 8 ఏళ్ల బాలుడు ఎక్కినట్లు గుర్తించిన టీటీ ఎస్ అచ్యుతరావు ఆ బాలుడిని కాకినాడ ఆర్పీఎఫ్ పోలీస్ సిబ్బందికి శుక్రవారం అప్పగించారు. ఈ బాలుడి విషయాన్ని స్త్రీ, శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎన్. విజయలక్ష్మికి వివరించగా ఆమె బాలుడి వివరాలను తెలుసుకున్నారు.

బాలుడి పేరు పి.గణేష్, తండ్రి రాజు, వయస్సు 8 సంవత్సరాలు బలగం పేట, అమీర్‌పేట, హైదరాబాద్ అని చెప్పాడన్నారు. తల్లిదండ్రులు తనను తిట్టడంతో తన తల్లిదండ్రులకు చెప్పకుండా సికింద్రాబాద్‌లో రైలు ఎక్కినట్లు చెప్పాడని స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారులు వివరించారు. ఈ బాలుడిని జీఆర్పీ ఎస్ఐ ఎస్ రవికుమార్ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ సిబ్బంది, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బందికి సంరక్షణ నిమిత్తం అప్పగించినట్లు తెలిపారు.

రాములోరి పెళ్లి సందడి

- కోదండరాముని కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి
- ఆంధ్రా భద్రాద్రి జి.మామిడాడలో రేపు నిర్వహణ

పెదపూడి: కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని శ్రీ కోదండరాముడి కల్యాణ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. కోరిన కోర్కెలు తీర్చే కోదండరాముడిగా భక్తులు ఆయనను కొలుస్తారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలంలోని భద్రాద్రి రాముడి ఆలయానికి దీటుగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆంధ్రా భద్రాద్రిగా పేరుగాంచిన ఈ ఆలయంలో తూర్పు, పశ్చిమ దిశల్లో నిర్మించిన గోపురాలు అత్యంత ఎత్తుగా ఉంటాయి.


ప్రత్యేక అలంకరణలో కొలువైన సీతారాములు వారు


ఆకట్టుకునే అద్దాల మందిరం

వాటిపై శిల్పాలను భాగవత, రామాయణాల్లోని అపురూప ఘట్టాలతో మనోహరంగా తీర్చిదిద్దారు. అవి భక్తులను ఆకట్టుకుంటాయి. గొల్లల మామిడాడలో శ్రీ కోదండ రామాలయం కల్యాణ కాంతులను సంతరించుకుంది. ఆదివారం జరిగే సీతారాముల కల్యాణానికి భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. వేల సంఖ్యలో వచ్చే భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడ మంచి ముత్యాలను తలంబ్రాలుగా వాడటం విశేషం.

కల్యాణ కొబ్బరి బొండాలు, రామనామ తలంబ్రాలు సిద్ధం


ద్వారంపూడి యువరాజారెడ్డి

జి.మామిడాడ గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డి అనే సూక్ష్మ కళాకారుడు కోదండ రామాలయంలో ఆదివారం జరిగే సీతారాముల కల్యాణానికి ప్రత్యేకంగా తయారు చేసిన కొబ్బరి బొండాలు, బియ్యపు గింజలపై మూడు భాషల్లో రాసిన రామ నామ తలంబ్రాలు సిద్ధం చేశారు.

ఆయన మాట్లాడుతూ కల్యాణ కొబ్బరి బొండాలపై శంఖు, చక్ర, నామాలతో కోదండరాముని సీతా, లక్ష్మణ, ఆంజనేయ సహితంగా బొండాలపై రంగురంగుల పాదులు, ముత్యాలు, లేసులు సహాయంతో సుందరంగా తీర్చిదిద్దినట్టు చెప్పారు. బియ్యపు గింజలపై ఎలాంటి సూక్ష్మ పరికరాలు వినియోగించకుండా భక్తి శ్రద్ధలతో పార్కర్ పెన్ను సహాయంతో నిష్టగా 1,00,116 గింజలపై తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషల్లో రాసి సమర్పిస్తున్నట్లు తెలిపారు. 15 ఏళ్లుగా బియ్యపు గింజలపై ఈ మూడు భాషల్లో రాస్తున్నానన్నారు. ఈ తలంబ్రాలను స్వామి వారి కల్యాణ క్రతువులో సమర్పించనున్నట్లు తెలిపారు. ముక్కోటి ఏకాదశికి ప్రారంభమైన ఈ కార్యక్రమం శ్రీరామనవమి రోజుతో పూర్తవుతుందన్నారు.


శంఖు,చక్ర, సీతా,రామ నామాలతో సుందరంగా ఉన్న కల్యాణ కొబ్బరి బొండాలు



రామనామాలు రాసిన బియ్యపు గింజలు


జి.మామిడాడలో కోదండరామాలయం తూర్పు, పశ్చిమ గోపురాలు

కల్యాణోత్సవ కార్యక్రమాలు వివరాలివీ..

- 6వ తేదీ మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో స్వామివారి కల్యాణం
- 7వ తేదీ సుప్రభాత సేవ, నిత్యోపాసన, డోలు సన్నాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు
- 8వ తేదీ సుప్రభాత సేవ, నిత్యోపాసన, సహస్రనామార్చన, మధ్యాహ్నం 3.30 గంటలకు సదస్యం
- 9వ తేదీ ఉదయం శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవం
- 10వ తేదీ ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, కంకణ విసర్జనం, పూర్ణాహుతి, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు
- 11 వ తేది అద్దాల శయన మందిరంలో రాత్రికి ఊయల సేవ, శ్రీ పుష్పయాగం కార్యక్రమాలతో కల్యాణోత్సవాలు ముగిస్తాయి.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	15,500
గటగట (వెయ్యి)	14,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	14,500
గటగట (వెయ్యి)	13,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

పెంచుకుంటున్న కూతురిపై కామాంధుడి అత్యాచారం

కరప: తల్లి చనిపోవడంతో వరసకు పిన్ని అయిన తన భార్య పెంచుకుంటున్న కూతురిపై కామాంధుడు అత్యాచారానికి ఒడికట్టిన ఘటన కరప మండలం వేళంగిలో జరిగింది. పోలీసులు కథనం మేరకు... వేళంగి గ్రామానికి చెందిన మండాది అమ్మాజీకి వివాహంకాగా కుమారుడు, కుమార్తె ఉన్నారు. అమ్మాజీ అక్క చనిపోవడంతో ఆమె కూతురైన సింగనీడి గంగాభవానీని తన వద్ద ఉంచుకుని పెంచుకుంటోంది. ఈనెల 3వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అమ్మాజీ భర్త శ్రీనివాసు గంగాభవానీని బలాత్కరించి, ఈ విషయం ఎవరికైనా చెప్తే నిన్ను, అమ్మాజీని చంపేస్తానని బెదిరించాడు. బాధితురాలు కేకలు వేయగా చుట్టుపక్కలవారు ఇచ్చి తలుపుకొట్టగా కామాంధుడు శ్రీనివాసు తలుపుతీసి, వారి నుంచి తప్పించుకుని పారిపోయాడు. అమ్మాజీ ఇంటికి రాగానే చుట్టుపక్కలవారు జరిగిన విషయం చెప్పారు. అమ్మాజీ శుక్రవారం కరప పోలీసుస్టేషన్‌కు వచ్చి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేయగా కరప ఎస్ఐ టి.సునీత కేసు నమోదు చేశారు. బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపించారు. ఎస్ఐ సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


మృతుడు మణికంఠ (ఫైల్)

గండేపల్లి: ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడిని చికిత్సకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు గండేపల్లి ఎస్సై యువీ శివనాగబాబు తెలియజేశారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామానికి చెందిన బాదవుల కేదార్ మణికంఠ (21) రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. గురువారం రాజమహేంద్రవరం నుంచి తన స్నేహితుడైన విష్ణువర్ధన్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో బిర్యాని తినేందుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండలంలోని గండేపల్లి శివారుకు వచ్చేసరికి ఎస్టీ రాజాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మోటార్ సైకిల్‌పై అజాగ్రత్తగా రాంగ్ రూట్లో వచ్చి వీరి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో కేదార్ మణికంఠకు తీవ్రంగాను, విష్ణువర్ధన్‌కు స్వల్పంగాను గాయాలుకాగా వీరిని రాజానగరం జీఎస్ఎల్‌కు తరలించగా అప్పటికే కేదార్ మణికంఠ మృతి చెందినట్టు తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

సీతమ్మకు కోవా సారె సిద్ధం


కోవాతో తయారు చేసిన వివిధ రకాల స్వీట్లు


కోవాతో స్వీట్లు చేస్తున్న మహిళలు

పి.గన్నవరం: స్థానిక శ్రీపట్టాభి రామస్వామి వారి ఆలయంలో ఆదివారం జరుగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలకు ఆలయ ధర్మకర్తలు పేరిచర్ల భీమరాజు, సత్యవాణి దంపతులు కోవా స్వీట్లతో తయారు చేయిస్తున్న కంత (సారె) భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో శ్రీరాముని తరపున సీతమ్మవారికి ఈ కంతను సమర్పిస్తారు. వివిధ రకాల ఫలాలు, పుష్పాలు, కూరగాయలు, పంచె, చీర, పర్ణశాల వంటి ఆకృతుల్లో కోవాతో తయారు చేస్తున్న స్వీట్లు భక్తులకు కనువిందు చేస్తున్నాయి. గత 16 ఏళ్ల నుంచి ఈ ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. ఏటా కోవాతో పాటు పలు రకాల పిండి వంటలను తయారు చేయించి సీతమ్మవారికి సమర్పిస్తున్నట్టు సత్యవాణి తెలిపారు. స్థానిక అక్విడెక్టు వద్ద వేంచేసిన శ్రీపట్టాభిరామ స్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా వైభవంగా కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. దీనికి 20 రోజుల ముందు నుంచి 100 రకాలకు పైగా కోవాతో స్వీట్లు, పిండి వంటలు తయారు చేయిస్తారు. స్వీట్లు, పిండి వంటల తయారీలో స్థానిక శ్రీరామ్ గార్డెన్స్‌కు చెందిన మహిళా భక్తులు సహకారం అందిస్తున్నారు.

మద్యం తాగిన దేవస్థానం ట్రాన్స్‌పోర్టు డ్రైవర్

విధుల నుంచి తొలగించిన అధికారులు

అన్నవరం: అన్నవరం దేవస్థానం ట్రాన్స్‌పోర్టులో ఔట్‌సోర్సింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న పి.వినోద్‌కుమార్ మద్యం తాగి వాహనం నడుపుతున్నట్టు బ్రీత్ అనలైజర్ పరీక్షలో తేలడంతో అతనిని విధుల నుంచి తొలగించారు. తదుపరి చర్యల కోసం ఈఓకు నివేదిక సమర్పించినట్టు దేవస్థానం సూపరిండెంట్ ఐవీ రామారావు శుక్రవారం తెలిపారు. సత్యదేవుని తొలిపావంచా వద్ద నిర్వహించిన తనిఖీలలో ఒక వ్యక్తి మంచినీటి సీసాలో మద్యం కలిగిఉన్న విషయం బయటపడింది. వెంటనే ఆ మద్యాన్ని స్వాధీనం చేసుకొని పారబోశారు. ఆ వ్యక్తిని వెనక్కి పంపించేసినట్టు తెలిపారు.

పెట్రోలియం రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతం

ఆయిల్ ఇండియా లిమిటెడ్ ఈడీ డైరెక్టర్ సలోమ యండో

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పెట్రోలియం రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని ఆయిల్ ఇండియా లిమిటెడ్ ఈడీ సలోమ యండో పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలో శుక్రవారం ఉదయం అలూమ్ని ఆడిటోరియంలో ఫిపి స్టూడెంట్ చాప్టర్స్ 13వ వార్షిక సమావేశం నిర్వహించారు. యూసీఈకే కెమికల్ ఇంజినీరింగ్, పెట్రోలియం ఇంజినీరింగ్ విభాగాలలోని జేఎన్‌టీయూకే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పెట్రోలియం ఇండస్ట్రీ (ఫిపి) స్టూడెంట్ ఛాప్టర్ ఆధ్వర్యంలో ఇది జరిగింది. జేఎన్‌టీయూకే ఫిపి స్టూడెంట్ చాప్టర్ ఫ్యాకల్టీ అడ్వయిజర్ ప్రొఫెసర్ కేవీ రావు అధ్యక్షత వహించగా ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, ఫిపి డైరెక్టర్ (అన్వేషణ ఉత్పత్తి) దేబ్ జ్యోతి వెలిగించారు. ముఖ్యఅతిథి శ్రీ సలోమ యాండో మాట్లాడుతూ సహజ వనరుల రంగంలో భారత ప్రభుత్వం నిర్దేశించిన నికర జీరో లక్ష్యాలను సాధించడానికి సంబంధిత సంస్థలు తీసుకుంటున్న వివిధ కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. భారతదేశం చమురు వినియోగంలో 3వ స్థానంలో ఉందని, ప్రపంచవ్యాప్తంగా 13.2 బిఓఈ (బ్యారెల్ ఆఫ్ ఈక్వివాలెంట్) వినియోగిస్తుండగా మన దేశంలో 4.7 బిఓఈ వినియోగిస్తున్నామన్నారు. భారతదేశంలో 26 అవక్షేపణా బేసిన్‌లు ఉండగా మొత్తం 3.36 మిలియన్ల చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో వ్యాపించి ఉన్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని త్వరలో చమురు నిక్షేపాల అన్వేషణ, అభివృద్ధిపై రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నామన్నారు. దేశంలోని విద్యాసంస్థలతో కలిసి సంయుక్తంగా ఎనర్జీ ఇనీషియేటివ్ ప్రోగ్రామ్స్‌ను చేపట్టనున్నామన్నారు.


జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న అతిథులు

నూతన ఆవిష్కరణలు అవసరం

ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ కెమికల్, పెట్రోలియం ఇంజినీరింగ్ విద్యార్థులు ఇంధన వనరుల ఉత్పత్తి రంగంలోకి రానున్న నేపథ్యంలో రాష్ట్ర, దేశ అవసరాల మేరకు ఇంధన వనరులను ఉత్పత్తి చేసేలా నూతన ఆవిష్కరణలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కాలుష్య రహితమైన ఇంధన వనరులను అందించాల్సిన బాధ్యత పీఈసీఈ విద్యార్థులపై ఉందన్నారు. ఫిపి డైరెక్టర్ దేబ్ అధికారి మాట్లాడుతూ విద్యార్థులను ఇంధన రంగంలో భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దడమే ఫిపి ప్రధాన లక్ష్యమన్నారు. సహజ వనరుల రంగంలో డ్రిల్లింగ్ మరియు అన్వేషణలో ఖచ్చితత్వం అనేది చాలా ముఖ్యమని, దీన్ని దష్టిలో పెట్టుకుని ఫిపి స్టూడెంట్ చాప్టర్‌ల ద్వారా ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. దేశంలోని 11 విద్యాసంస్థల నుంచి వచ్చిన ఫిపి స్టూడెంట్ చాప్టర్‌ల ప్రతినిధులకు అతిథులు ఫిపి ఫ్లాగ్, బ్యాడ్జ్‌ను అందజేసి అభినందించారు. ఫిపి 13వ వార్షిక సమావేశంలో భాగంగా 'భారతదేశంలో అధిక శక్తి సామర్థ్యం, కచ్చితత్వంతో హైడ్రోకార్బన్‌ల అన్వేషణను వేగవంతం చేయడం' అనే నినాదంపై స్టూడెంట్ చాప్టర్లకు నిర్వహించిన పోటీలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నీరజ్ సిన్హా, ఓఎన్‌జీసీ ఈస్టర్న్ ఆఫ్‌షోర్ అసెట్ ఈడీ అసెట్ మేనేజర్ రత్నేష్ కుమార్, ఓఎన్‌జీసీ కావేరీ బేసిన్ మేనేజర్ ఈడీ శంతను ముఖర్జీలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. తదుపరి పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన స్టూడెంట్ చాప్టర్లకు అతిథులు బహుమతులను ప్రదానం చేయడంతో పాటు విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. జేఎన్‌టీయూకే డైరెక్టర్‌లు ప్రొఫెసర్ బి.బాలకృష్ణ, ఏ.స్వర్ణకుమారి, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహనరావు, అక్నూ మాజీ ఉపకులపతి కె.పద్మరాజు, కెమికల్, పెట్రోలియం ఇంజినీరింగ్ విభాగాధిపతులు, అధ్యాపకులు, దేశంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన ఫిపి స్టూడెంట్ చాప్టర్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

మేమంతా శివరామ సుబ్రహ్మణ్యం వెంటే..

స్పష్టం చేసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆర్యవైశ్యులంతా ఏపీఐఐసీ మాజీ చైర్మన్, వైశ్య ప్రముఖుడు శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం వెంటే ఉంటామని వైశ్య సంఘం నాయకులంతా స్పష్టం చేశారు .తామంతా రాజకీయ పార్టీల జెండాలతో రాలేదని, వైశ్యుల అజెండాతో మాత్రమే వచ్చామని స్పష్టం చేశారు. శుక్రవారం లాలాచెరువులోని వైశ్య హాస్టల్‌లో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రగళ్ళపాటి కనకరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రాజకీయాలతో సంబంధం లేకుండా శివరామ సుబ్రహ్మణ్యంను పెద్దగా ఉంచి సేవా కార్యక్రమాలు చేస్తూ ఏ సమస్య వచ్చినా వాటిని పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు. కోనసీమ జిల్లా విడదీసినప్పుడు రాష్ట్ర మహాసభ బైలాకు విరుద్ధంగా కమిటీ ఏర్పాటు వలన ప్రయోజనం లేదన్నారు. ప్రజలు సేవచేసే వ్యక్తులను గుర్తిస్తారని అన్నారు. శివరామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలో అందరికీ వైశ్య హాస్టల్ ఒక షెల్టర్ కావాలనే ఉద్దేశంతో ఒక ఫ్లోరు అందిస్తున్నట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో ఆతిథ్యానికి మారుపేరుగా ఉన్నవారిని విడదీయడం సబబు కాదన్నారు. తనను టార్గెట్ చేయాలని చూస్తున్నారని, తనవల్ల ఎవరూ మోసపోలేదని స్పష్టం చేశారు. తాను చెప్పిందే జరగాలని అనుకోనని, ఎవరు చెప్పినా వింటానన్నారు. రాష్ట్ర మహాసభ ఒకే నాయకత్వం కింద ఉండాలని భావిస్తానని, కాని రాష్ట్ర బైలాను పక్కన పెట్టి నియామకాలు చేపట్టడం కరెక్టో కాదో వారే ఆలోచించుకోవాలన్నారు. పెద్దలముందు చేసిన ప్రమాణాల ప్రకారం నడుచుకుంటే సమాజంలో కాని , సంఘంలో కాని గౌరవం ఉంటుందని శివరామ సుబ్రహ్మణ్యం హితవు పలికారు. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబీ, కార్యదర్శి కుసుమంచి పాపారావు, కోశాధికారి కంచర్ల కృష్ణ మోహన్, నంబూరి రెడ్డియ్య, పల్లపోతు బంగారం, కోరుప్రోలు వెంకటేశ్వరరావు, అత్తలూరి సాయిబాబా, కుసుమంచి సుబ్బరాయులు రాజమండ్రి చాంబర్ అధ్యక్షుడు తవ్వా రాజా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శివరామ సుబ్రహ్మణ్యం

గర్భిణి కిడ్నాప్ కథ సుఖాంతం

- 9 నెలలు గుడ్డలు పెట్టుకుని గర్భం దాల్చినట్టు నటన
- గొడ్రాలు అనే మాట పడలేకే ఈ నాటకం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో కలకలం సృష్టించిన గర్భిణి కొప్పిశెట్టి సంధ్యారాణి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయం శుక్రవారం విడుదల చేసింది. దేవీపట్నం మండలం ఇందుకూరిపేటకు చెందిన కొప్పిశెట్టి సంధ్యారాణి 9 నెలల గర్భిణి కావడంతో ఆమె భర్త రాజమహేంద్రవరంలోని జయ కిడ్నీకేర్ ఆసుపత్రికి గురువారం పురిటికి తీసుకువచ్చాడు. ఆసుపత్రిలో ఆమెకు ఓపీ చీటీ రాశారు. డాక్టర్ చూసేలోగా ఆమె రెండుసార్లు బయటకు వచ్చింది. అలా మూడోసారి బయటకు వచ్చి కనిపించకుండా పోయింది. దీంతో కంగారుపడిన సంధ్యారాణి భర్త విషయాన్ని త్రీటౌన్ పోలీసులకు తెలిపాడు. త్రీటౌన్ సీఐ వి.అప్పారావు పర్యవేక్షణలో ఎస్సై షేక్‌సుభానీ, మరికొంత మంది పోలీసులు రెండు టీములుగా విడిపోయి ఆచూకీ కోసం గాలించారు. పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. సంధ్యారాణి ఫోన్ ఆధారంగా కాకినాడలో ఆమె ఉన్నట్లు తెలుసుకున్నారు. అక్కడ బస్టాండ్‌లో ఆమెను పట్టుకున్నారు. పోలీసులు ఆమెను ప్రశ్నించగా...తనను ఎవరో కిడ్నాప్ చేశారని, తనకు ఇద్దరు కవల పిల్లలు పుట్టారని, ప్రసవం అయిన వెంటనే పిల్లను ఎవరో ఎత్తుకెళ్లిపోయారని, పలు రకాలుగా పోలీసులకు తెలిపింది. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

9 నెలలు గుడ్డలు పెట్టుకుని గర్భిణిగా..

కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో దుర్గను పరిశీలించిన వైద్యులు ఆమె గర్భిణి కాదని తేల్చి చెప్పారు. దీంతో హతాశులయిన పోలీసులు తేరుకుని ఆమె ఈ నాటకం ఆడడానికి గల కారణాలను తెలుసుకున్నారు. దుర్గకు పెళ్లి అయి తొమ్మిది సంవత్సరా లు అయ్యింది. ఆమెకు పిల్లలు లేరు. దీంతో ఆమె బయటి వారు, ఇంటిలో కుటుంబ సభ్యులు ఆమెను గొడ్రాలుగా చూస్తున్నారు అనే భావనంతో తనకు కడుపు వచ్చినట్లు నాటకమాడింది. ఈ తొమ్మిది నెలలు చాలా జాగ్రత్తగా ఉండాలని, భార్యాభర్తలు చాలా దూరంగా ఉండాలని తెలిపింది.

సంధ్యారాణి డాక్టర్ దగ్గరకు వచ్చి లోపలికి వెళ్లినప్పుడు తనకు గర్భం ఎందుకు రావడంలేదని మాత్రమే అడిగి బయటకు వచ్చేసేది. బయట భర్తను కూర్చోపెట్టి ఆ సమయంలో ఆమె ఒక్కతే డాక్టర్ వద్దకు వెళ్లేది. డాక్టర్ అంతా బావుందని, పురుడు వచ్చే వరకు చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పారని తెలిపేది. దీంతో దుర్గ భర్త నిజమని నమ్మి ఆమెను కంటికి రెప్పలా చూసుకోసాగాడు. ఆమె కడుపు రోజురోజుకీ పెరుగుతున్నట్లు గుడ్డలు పెట్టుకుని కాలం వెళ్లదీసింది. చివరికి ఆ తంతు బయటపడడంతో ఆమె పరిస్థితిపై జాలి పడడం పోలీసులవంతైంది. పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసును వేగంగా ఛేదించిన త్రీటౌన్ సీఐ వర్రే అప్పారావు, ఎస్సై షేక్‌సుభానీ, పోలీసు సిబ్బందిని ఎస్పీ డి.నరసింహాకిశోర్ అభినందించారు.

గోదావరిలో పడి ఏడో తరగతి విద్యార్థి మృతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గోదావరి నదిలో పడి మెసా గనిపోతురాజు (12) అనే విద్యార్థి శుక్రవారం మృతిచెందాడు. తాడితోట శారదానగర్‌కు చెందిన గనిపోతురాజు డీఎంహెచ్ స్కూలులో ఏడో తరగతి చదువుతున్నాడు. ఉదయం యథావిధిగా స్కూలుకు వెళ్లాడు. మధ్యాహ్నం నుంచి స్నేహితులతో కలిసి పుష్కర్‌ఘాట్‌కు వెళ్లాడు. అక్కడ గోదావరి నదిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ మునిగి చనిపోయాడు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. విద్యార్థిని తండ్రి బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.